క్లుప్తంగా

తుపాను బాధితులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు దినసరి కూలీలు అవస్థలు పడుతున్నారు. దీంతో అక్షయ పాత్ర ఫౌండేషన్ సహకారంతో సుమారు 800 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి ప్రసాద్, పిల్లల మాణిక్యం, శ్రీనివాస్ పట్నాయక్, గాడు వెంకట లక్ష్మి, కరుమజ్జి జ్యోతి, గుమ్మడి రాధ, తిరుమలరెడ్డి హరి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



సామాజిక పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో అర్హులైన వారికి శనివారం సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే పి.గణబాబు అందించారు. పాతరామాలయం వీధి వద్ద దివ్యాంగులు,వితంతువులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను,పార్టీ కార్యదర్శి పోతబత్తుల శ్రీను,మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం



బాధితుల కుటుంబాలతో మాట్లాడుతున్న కసిరెడ్డి సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి సత్యనారాయణ, నాయకుడు కెంగువ అచ్యుతరావు అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద శనివారం బాధిత కుటుంబాలతో వారు మాట్లాడారు. ప్రమాదం తర్వాత యాజమాన్యం బాధిత కుటుంబాలకు కలిసి భరోసా కల్పించలేదన్నారు.

శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురికావడానికి కారణమైన శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాంబాబు, జోన్ కార్యదర్శి లోకేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పూండి - నౌపడ, తిలారు - కొటబొమ్మాళి సెక్షన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల ఆయా తేదీల్లో రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- పుదుచ్చేరిలో ఈ నెల 4న సాయంత్రం 6.50 గంటలకు బయల్దేరాల్సిన పుదుచ్చేరి - భువనేశ్వర్ (12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 9.35 గంటలకు బయల్దేరుతుంది.
- కేఎస్ఆర్ బెంగళూరులో ఈ నెల 4, 6న మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 5 నుంచి 7 వరకు విశాఖపట్నం - పలాస - విశాఖపట్నం (07470 / 07471) మెము శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది.ఆయా తేదీల్లో ఈ రైలు శ్రీకాకుళం రోడ్ - పలాస మధ్య రాకపోకలు సాగించదు.

వదలని వాన



మల్కాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో చేరిన వర్షపు నీరు



రోడ్డుపై నిలిచిన నీరు, మురుగును తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



జనతాకాలనీ వద్ద కూలిన రక్షణ గోడ

వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. గురువారం మొదలైన వర్షం శనివారం కూడా కురిసింది. వర్షం కారణంగా జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీల్లేకుండా రోజంతా వానకురవడంతో జనం అవస్థలు పడ్డారు. భారీ వర్షం కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో పిల్లలు ఇంటికే పరిమితం అయ్యారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రైయిన్లు , గెడ్డల్లో వర్షపు నీరు పొంగి ప్రవహించింది.

- రోడ్లు జలమయం
- పొంగిన గెడ్డలు,కాలువలు
- కూలిన రక్షణ గోడ

మల్కాపురం: తుపాను కారణంగా మూడు రోజుల నుంచి తెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పారిశ్రామిక ప్రాంతం ముద్దయింది.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సర్వీసు రోడ్లపై భారీగా వరద నీరు చేరింది. పలు చోట్ల గెడ్డలు,కాలువలు పొంగిపొర్లాయి. శనివారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి మల్కాపురం పోలీస్‌స్టేషన్ ముందు పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరింది. నీరు స్టేషన్ ఆవరణలోకి ప్రవేశిస్తుండడంతో సిబ్బంది తలుపులు వేసుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మల్కాపురం ,గుల్లలపాలెం,రామ్‌నగర్ ప్రాంతాల్లో ఉప్పొంగాయి. పెద్ద కాలువలు పొంగడంతో నీరు సమీపంలోని ఇళ్లలోకి చేరింది. మరో వైపు శానిటరీ సిబ్బంది వర్షంలో తడుస్తూనే సర్వీసు రోడ్లపై నిలిచిన నీటి తొలగించారు.

కూలిన రక్షణ గోడ

వర్షానికి జీవీఎంసీ 60వ వార్డు పరిధి జనతాకాలనీ కొండ ప్రాంతంలో రక్షణ గోడ కూలింది. గోడ దిగువ చరియలు విరిగిపడడంతో గోడ కూలి గోడ దిగువన గల ఇంటిపై పడింది. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరామర్శ

రక్షణగోడ కూలిన విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. విషయాన్ని ములగాడ మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



గొడుగు ఆధారంతో రాకపోకలు

కూలిన ఇంటి గోడ



పాతరామాలయం వద్ద కూలిన గోడను పరిశీలిస్తున్న నాయకులు

జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం పాతరామాలయం వీధి వద్ద వర్షాలకు నాని శనివారం సాయంత్రం ఓ ఇంటి మట్టి గోడ కూలింది. గోడ రోడ్డుపై పడడంతో ఇంట్లో ఉన్న వారికి ఎటువంటి నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య,మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరి అధికారులతో మాట్లాడి కూలిన శిథిలాలను తొలగించేలా చర్యలు చేపట్టారు.

నీటమునిగిన ప్రాంతాలు

సింధియా: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగాయి. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ కూడలి వద్ద ప్రధానరహదారిపై ఉన్న కల్వర్టులోకి పూడికలు చేరడంతో వరదనీరు ఉప్పొంగింది. ఏకేసీకాలనీలోని నివాస గృహాల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు విషయం తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బందితో పూడికలను తొలగింపజేశారు.

కల్వర్టు ఎత్తు పెంచాలి

కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలంలోనే కాకుండా ఈ సమస్య తరచూ ఉత్పన్నమవుతుందన్నారు. ఎగువ ప్రాంతాలైన క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవతో పాటు షిప్‌యార్డ్‌కాలనీ ప్రజల వాడుకనీరు, వర్షపునీరు ఈ కల్వర్టు ద్వారా దిగువకు వెళ్తుందని, కల్వర్టు ఎత్తు పెంచాలని కోరినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. కల్వర్టు కింద గ్యాస్, మంచినీటి పైప్‌లైన్లతో పాటు పలు కంపెనీలకు చెందిన కేబుళ్లు ఉన్నాయని, దీంతో వ్యర్థాలు కేబుళ్లకు చిక్కుకుని నీటిప్రవాహానికి అడ్డంకిగా మారడంతో మురుగునీరు, వర్షపునీరు బయటకు వస్తుందన్నారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి యుద్ధప్రాతిపదికన కల్వర్టు ఎత్తు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని నాగేశ్వరరావు కోరారు.



పూడికలను దగ్గరుండి తీయిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

విశాఖ విద్య: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ,జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో శనివారం ఎన్ఏడీ దరి సరస్వతీ విద్యావిహార్ పాఠశాలలో జీసీడీవో డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా, గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావు అధ్యక్షత బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుతో పిల్లల దృష్టి మత్తు వైపు మరలకుండా అవగాహన కల్పించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఉమారాజ్,సైకాలజిస్ట్ మంత్రి వంశీ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు,ఐ.సి.డి.ఎస్ అధికారి ఎం.వి.రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

అల్లిపురం: లాడ్జిలో పనిచేసే యువకుడు.. అదే లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. ములగాడ గ్రామానికి చెందిన సర్వసిద్ధి మహేష్ (23) అల్లిపురంలోని ఓ లాడ్జిలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మహేష్ విధులకు హాజరయ్యాడు. అనంతరం విధులు ముగించుకుని లాడ్జిలోని గదిలో నిద్రించాడు. ఉదయం బయటకు రాకపోయే సరికి.. తోటి ఉద్యోగి అతన్ని నిద్ర లేపేందుకు గది వద్దకు వెళ్లాడు. గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న మహేష్‌ను చూసి షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనపై లాడ్జి ఉద్యోగులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని సోదరుడు జగదీష్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓటీ ఇప్పించాలని వినతి

సింధియా : కోర్టు కేసులతో సంబంధం లేకుండా రక్షణ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ హెచ్ఆర్ఏపై ఓటీ ఇప్పించాలని, ఎస్‌బీటీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలని నేవీ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రెడ్డి వెంకటరావు పార్లమెంటరీ పిటిషన్ కమిటీ సభ్యులకు వినతిపత్రం అందించారు. కోర్టు కేసు గెలుచుకుని ఐదు నెలలు గడుస్తున్నా, మేనేజ్‌మెంట్‌కు కోర్టులో స్టే రాకపోయినా, రక్షణ రంగంలో విశాఖలో పనిచేస్తున్న కార్మికులకు అన్ని అలవెన్సులు కలుపుకుని ఓటీ ఇవ్వడానికి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు మేనేజ్‌మెంట్ నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్షపై విశాఖలో పర్యటిస్తున్న పార్లమెంటరీ పిటిషన్ కమిటీ దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మరమ్మతుల కోసం మూసేశారని, దీంతో ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయంగా ఎస్‌బీటీ బ్రిడ్జి పైనుంచి రాకపోకలకు అనుమతించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



వినతిపత్రం అందిస్తున్న నేవీ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రెడ్డి వెంకటరావు

కాలువలో చెట్లకొమ్మలు తొలగింపు



కాలువలో కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం : కాలువలో చెట్ల కొమ్మలు అడ్డం పడడంతో వర్షం నీటి ప్రవాహానికి ఇబ్బందిగా వుందని అందిన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ 92వ వార్డు శానిటరీ అధికారులు స్పందించి శుభ్రం చేశారు.

శనివారం బాపూజీనగర్‌లో ప్రధాన కాలువ కల్వర్టులో ఇరుక్కుపోయిన చెట్టు కొమ్మలను అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మికులు తొలగించారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి

ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

ఉక్కునగరం: ఈపీఎస్-95 పెన్షనర్లకు రూ. 9 వేల పెన్షన్‌తో పాటు డీఏ ఇవ్వాలని ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ఉక్కునగరంలోని సీ భవన్‌లో శనివారం ఈపీఎస్-95 పెన్షనర్ల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఈపీఎఫ్ ట్రస్టులో రూ. 21,30,000 లక్షల కోట్లు కార్పస్ ఫండ్ ఉందన్నారు. వందల కోట్లు వడ్డీ రూపంలో వస్తోందన్నారు. ఆ సొమ్ముతో దేశవ్యాప్తంగా ఉన్న 73 లక్షల మందికి సులభంగా రూ.9 వేల పెన్షన్‌తో పాటు డీఏ కూడా ఇవ్వొచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేసి... ఆ సొమ్మును అదాని, అంబానీలకు ముట్టచెప్పాలని చూస్తుందని ఆరోపించారు.

నూతన కమిటీ ఎన్నిక ..సర్వసభ్య సమావేశం అనంతరం ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మాటూరి శ్రీనివాసరావును జాతీయ అధ్యక్షుడిగా, భార్గుజార్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ గా, కె.సత్యనారాయణమూర్తిని ప్రధానకార్యదర్శి గా, ఎస్వీ రమణను కోశాధికారిగా ఎన్నుకున్నారు. డాక్టర్ కె. రాజశేఖర్ అధ్యక్షత వహించిన సమావేశంలో మాటూరి శ్రీనివాసరావు, ఎల్. మురళీకృష్ణ, ఎం. ప్రసాద్, కృష్ణారెడ్డి, సాంబశివరావు, రఫీ, మురళీరాజు, సంపూర్ణం, బి. సత్యానందం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూతన జాతీయ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి కౌర్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో తిరిగి విలీనం చేయాలని ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమర్జీత్ కౌర్ డిమాండ్ చేశారు. ఉక్కు ఎల్ అండ్ డీసీ విభాగం వద్ద శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆమె ప్రసంగించారు. ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ఐరన్ ఓర్, ఇతర ముడి సరకు సరఫరా చేసి స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం తేవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్, జి. ఓబులేసు, స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఎస్.ఎన్.రావు, డి. ఆదినారాయణ, నాయకులు జె. రామకృష్ణ, మసేనురావు, రాజబాబు, కనకరాజు పాల్గొన్నారు.

ఉక్కు దీక్షలకు మద్దతు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని అవంతి అన్నమాచార్య వాగ్గేయ వరదా వాహిని సంస్థ మహిళా ప్రతినిధి మాతా అవంతి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన 1297వ రోజు రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.కార్మికుల దీక్షకు మద్దతుగా మహిళా ప్రతినిధులు కోలాట ప్రదర్శన చేశారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేయాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, అవంతి అన్నమాచార్య వాగ్గేయ వరదా వాహిని సంస్థ ప్రతినిధులు ఎన్.వరలక్ష్మి, జి.లక్ష్మి కుమారి, ఎన్.కృష్ణవేణి, కె.సావిత్రి, ఎస్.సీతమ్మ, విజయ వరసాల పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న అమర్జీత్ కౌర్

ఉక్కును ఆదుకోండి

బీఎంఎస్ నాయకుల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని, ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, కార్మికులను నష్టపరిచే సర్క్యులర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు జనసేన, టీఎన్‌టీయూసీ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.వి.ఎస్. నాయుడు, జనసేన నాయకులు గంధం వెంకటరావు, నరేంద్ర కుమార్, స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి రామస్వామి, జెర్రిపోతుల రమణ తదితరులు పాల్గొన్నారు.

ధరాభారంపై సీపీఐ పోరుబాట

అల్లిపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో అన్ని వర్గాల ప్రజలపై ధరల భారం పెరగుతోందని సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు తెలిపారు. ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను శనివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో సామాన్యులు బతకలేని స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలే ధరల పెరుగుదలకు కారణమని విమర్శించారు. ప్రజల పక్షాన నిలిచిన సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆదివారం నుంచి వారం రోజుల పాటు పార్టీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, సీఎన్ క్షేత్రపాల్, జేడీ నాయుడు, ఎన్.నాగభూషణం, ఎ. దేముడమ్మ, బి.పుష్పలత, జి.కాసులరెడ్డి, సీహెచ్ కాసుబాబు, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చేపల వేటకు ఆధునిక టెక్నాలజీ

మహారాణిపేట : చేపల వేటలో ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నామని, ముందుగా దీనిపై మత్స్యకారులకు అవగాహన కలిగిస్తున్నట్లు రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోల్లా శంకర్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద వివిధ మత్స్యకార సంఘాల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ వారితో మాట్లాడుతూ బోట్లు వేట సమయంలో బోల్తా పడకుండా, కెరటాల వల్ల బోటు అదుపు తప్పకుండా నియంత్రించే ఆధునిక టెక్నాలజీని ప్రయోగాత్మకంగా ప్రవేశ పెడుతున్నామన్నారు. కమిషనర్ వెంట మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ కూడా ఉన్నారు. ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మయ్య, బర్రె కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకార నాయకులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ కమిషనర్ దోల్లా శంకర్

రిటైర్డ్ జైల్ అధికారులకు సత్కారం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సేవలందించిన ఇద్దరు అధికారులు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని జైల్ అధికారులు ఘనంగా సత్కరించారు. జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ పి.శ్రీరామచంద్రరావు, అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ బి.రెబెకా మేరీ శనివారం రిటైరయ్యారు. కారాగార సమావేశ మందిరంలో వారిద్దరిని ముఖ్య అతిథి జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ సిబ్బందితో కలిసి సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామచంద్రరావు, రెబెకా జైల్‌లో విశేషంగా సేవలు అందించారని కొనియాడారు. వారి శేష జీవితం ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని కోరుతున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో జైల్ అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకరరావు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వార్డర్లు పాల్గొని రిటైర్డ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.



రెబెకా మేరీని సత్కరిస్తున్న జైల్ అధికారులు